క్లుప్తంగా

పాఠశాలలో కిడ్డీ బ్యాంక్

పోరుమామిళ్ల : టేకూరుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఉపాధ్యాయుడు తుపాకుల శ్రీనివాసులు కిడ్డీ బ్యాంక్ ప్రారంభించి విద్యార్థులతో పొదుపుకు శ్రీకారం చుట్టారు. శ్రీనివాసులు గత 26 సంవత్సరాలుగా తాను పనిచేసిన పాఠశాలల్లో విద్యార్థులచే పొదుపు చేయించి, పొదుపు ఉద్యమాన్ని కొనసాగించారు. తల్లిదండ్రులు ఇచ్చే డబ్బు తినుబండారాలకు, ఆట వస్తువులకు దుబారా చేయకుండా పొదుపు చేయడాన్ని అలవాటు చేయిస్తే భవిష్యత్తులో ఆ డబ్బు వారికి, వారి కుటుంబానికి ఎంతో ఆదరువుగా నిలుస్తుందని నమ్మిన శ్రీనివాసులు విద్యార్థులతో పొదుపు చేయిస్తున్నారు. కార్యక్రమంలో హెడ్‌మాస్టర్ వెంకటరమణయ్య, ఉపాధ్యాయులు కరీముల్లా, మహబూబ్ బాషా, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆలయ ప్రధాన కార్యదర్శిగా తిరుమలయ్య

పోరుమామిళ్ల : రంగసముద్రం పంచాయతీ టీటీడీ కళ్యాణ మండపం ఎదురుగా ఉన్న శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయ ప్రధాన కార్యదర్శిగా ఎస్. తిరుమలయ్య ఆచారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సోమవారం ఆలయ గౌరవ అధ్యక్షుడు జగన్మోహనాచారి, అధ్యక్షుడు నారోజు శ్రీనివాసాచారి మాట్లాడుతూ తిరుమలయ్యాచారి ఆలయ నిర్మాణం నుంచి ఆలయ అభివృద్ధి వరకు ఎంతో సేవలందించారన్నారు. ఆయన అంకితభావం, కృషిని గుర్తించి ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నామన్నారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

బి.కోడూరు : మండలంలోని ఆనంవారిపల్లె చెరువులో అనాథ శవంగా మృతిచెందిన గుర్తు తెలియని మృతదేహానికి సోమవారం బి.కోడూరు పోలీసులు, రెవెన్యూ అధికారులు కేసు నమోదు చేసుకుని విచారించి ఎవరూ లేరని తెలిసి అనాథ శవంగా గుర్తించి మృతదేహానికి బి.కోడూరు పోలీసులు, రెవెన్యూ సిబ్బంది ఆధ్వర్యంలో ఆనంవారిపల్లె గ్రామ సమీపాన ఉన్న స్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మున్సిపల్ కార్యాలయ సభాభవనంలో మంగళవారం ఉదయం 10.30 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులతోపాటు సభ్యులందరూ సమావేశానికి హాజరు కావాలని ఆయన కోరారు.

2న మున్సిపల్ సమావేశం

మైదుకూరు : మైదుకూరు మున్సిపాలిటీ సర్వసభ్య సమావేశం నవంబర్ 2వ తేదీన నిర్వహిస్తున్నట్టు మున్సిపల్ కమిషనర్ వై.రంగస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక తెలుగుగంగ కాలనీలో నూతనంగా నిర్మించిన మున్సిపల్ కార్యాలయం సభాభవనంలో ఉదయం 11 గంటలకు మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. మున్సిపల్ చైర్మన్ మాచనూరు చంద్ర అధ్యక్షతన జరిగే సమావేశంలో కౌన్సిలర్లు, అధికారులు పాల్గొనాలని కోరారు.

2న ప్రొద్దుటూరు మండల పరిషత్ సమావేశం

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మండల సర్వసభ్య సమావేశాన్ని నవంబర్ 2న ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.కుళ్లాయమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. అధికారులు, సభ్యులందరూ సమావేశానికి తప్పక హాజరు కోవాలని ఆమె కోరారు.

బాధ్యతలు స్వీకరించిన వన్‌టౌన్ సీఐ



ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు వన్‌టౌన్ సీఐగా ఎం.శ్రీకాంత్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 2019 బ్యాచ్‌కు చెందిన ఆయన అనంతపురంలో పని చేస్తూ ప్రొద్దుటూరుకు వచ్చారు. ఇక్కడ పని చేస్తున్న సీఐ రాజారెడ్డి కడపకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా సీఐ శ్రీకాంత్ మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటానని చెప్పారు.

పాఠశాలపై చర్యలు తీసుకోవాలని వినతి

చాపాడు : నక్కలదిన్నె రోడ్డులోని ప్రైవేటు పాఠశాలపై విచారణ చేపట్టి తగిన చర్యలు తీసుకోవాలని సోమవారం మండల విద్యాధికారి రవిశంకర్‌కు రాయలసీమ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ రాష్ట్ర అధ్యక్షులు జగన్ వినతి పత్రం అందజేశారు. పాఠశాలలో మౌలిక వసతులు, అర్హత కలిగిన ఉపాధ్యాయులు, ఇంకా పలు రకాలైన అంశాలపై విచారించాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

నవంబర్ 3న జగనన్నకు చెబుదాం కార్యక్రమం

చాపాడు : మండల కేంద్రమైన చాపాడులో నవంబర్ 3వ తేదీన జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి శ్రీధర్‌నాయుడు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఉదయం 9.30 గంటల నుంచి జరుగనున్న జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ విజయరామరాజు హాజరు అవుతారని తెలిపారు. ఎలాంటి సమస్యలు ఉన్న ప్రజలు కలెక్టర్ దృష్టికి తీసుకురావచ్చని ఎంపీడీఓ కోరారు.

గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- ప్రతి ఇంటికి ప్రభుత్వ పథకాలను వివరించండి
- ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి

బద్వేలు అర్బన్ : వచ్చే ఎన్నికల్లో మరోసారి వైఎస్సార్‌సీపీ గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు కలిసికట్టుగా పనిచేయాలని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలు పేర్కొన్నారు. స్థానిక నెల్లూరు రోడ్డులోని శ్రీదేవి, భూదేవి సమేత కళ్యాణ వేంకటేశ్వరస్వామి కల్యాణ మండపంలో సోమవారం ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి కార్యక్రమంపై బద్వేలు మున్సిపాలిటీ, బద్వేలు రూరల్ నాయకులు, గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు, బూత్‌కన్వీనర్లు, వలంటీర్లతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడుతూ దేశంలో ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా ఇచ్చిన హామీల్లో 98 శాతం హామీలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గడిచిన నాలుగున్నర ఏళ్ల కాలంలో కులం, మతం, పార్టీ చూడకుండా అర్హతే ప్రామాణికంగా అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలను అందజేశారన్నారు. నవంబర్ 9 నుంచి ప్రారంభంకానున్న ఎందుకు ఆంధ్రాకు జగనే కావాలి కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రతి గడపకు వెళ్లి వివరించాలని కోరారు. అంతేకాకుండా గత ప్రభుత్వ వైఫల్యాలను కూడా ప్రజలకు వివరించాలని సూచించారు. ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, కుడా చైర్మన్ గురుమోహన్, గిద్దలూరు అసెంబ్లీ ఎన్నికల పరిశీలకులు బంగారు శీనయ్య, టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ అల్లాబకాష్, జెడ్పీటీసీ పోలిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ గోపాలస్వామి, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ, మండల అధ్యక్షులు సుందర్‌రామిరెడ్డి, మల్లేశ్వర్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్లు యద్దారెడ్డి, రామసుబ్బారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సుబ్బారెడ్డి, వక్ఫ్ బోర్డు డైరెక్టర్ ఉమర్, సింగిల్‌విండో అధ్యక్షుడు శేఖర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ సుబ్బారెడ్డి, మాజీ ఎంపీపీ వెంకటేశ్వర్‌రెడ్డి, నియోజకవర్గ అధికార ప్రతినిధి వెంకటేశ్వర్లు, ఆయా వార్డుల ఇన్‌చార్జిలు, కౌన్సిలర్లు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

సంక్షేమం అందాలంటే మళ్లీ జగన్ సీఎం కావాలి

బ్రహ్మంగారిమఠం : సంక్షేమం, అభివృద్ధి ఫలాలు క్షేత్ర స్థాయిలో అందాలంటే రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోమారు ముఖ్యమంత్రి కావాలని ఎమ్మెల్యే ఎస్ రఘురామిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక యోగివేమారెడ్డి రెడ్ల అన్నదాన సత్రం కల్యాణ మండంలో సోమవారం సాయంత్రం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన హామీలను మరచిపోయిందన్నారు. మన ప్రభుత్వం వచ్చిన తరువాత ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో ప్రజలు కూడా మళ్లీ జగనే కావాలి అంటున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అందిచిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు పూర్తి స్థాయిలో తెలిపేందుకే నవబంరు 9నుంచి నెలరోజుల పాటు ప్రతి గ్రామ సచివాలయం పరిధిలోని కుటుంబాలను వలంటీర్లు, సచివాలయ కన్వీనర్లు, గృహసారధులు, పార్టీ నాయకులు తిరగాలన్నారు. అనంతరం జిల్లా వక్ఫబోర్డు చైర్మన్ మదీనా దస్తగిరి మాట్లాడుతూ రాబోయే ముందుతరాల వారు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే మళ్లీ సీఎంగా జగనన్న రావాలి అన్నారు. ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రతి నిరుపేదకు సంక్షేమం అందించిన ఘనత మన ముఖ్యమంత్రికి దక్కుతుందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ మేకల రత్నకుమార్‌యాదవ్, సింగల్‌విండో అధ్యక్షుడు నేలటూరు సుబ్బారెడ్డి, మండల గ్రామ సచివాలయాల కన్వీనర్ కూనపులి రాజానాయుడు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

జగనన్నే మళ్లీ సీఎం కావాలి..
రాచమల్లు హ్యాట్రిక్ కొట్టాలి

- పాదయాత్రగా నందవరానికి వెళ్లిన ఎంపీపీ శేఖర్ యాదవ్
- పాదయాత్రను ప్రారంభించిన ఎమ్మెల్యే రాచమల్లు, మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీదేవి



పాదయాత్ర ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్

ప్రొద్దుటూరు : జగనన్న మళ్లీ ముఖ్యమంత్రి కావాలి, ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి హ్యాట్రిక్ కొట్టాలని కోరుతూ ప్రొద్దుటూరు మండల పరిషత్ అధ్యక్షుడు సానబోయిన శేఖర్ యాదవ్ సోమవారం కర్నూలు జిల్లా నందవరానికి పాదయాత్ర ప్రారంభించారు. స్థానిక రామేశ్వరంలోని చౌడేశ్వరిదేవి ఆలయంలో పూజలు చేసిన అనంతరం పాదయాత్రను ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల కోసం వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తొలిమారు ఎమ్మెల్యే అయినా గతంలో ప్రభుత్వం లేని కారణంగా రూపాయి నిధులు నియోజకవర్గానికి రాలేదన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రెండేళ్లు కరోనాతో ఇబ్బందులు పడ్డామన్నారు. ఇప్పుడిప్పుడే అభివృద్ధి పనులు జరుగుతున్నాయని అన్నారు. మరోమారు రాచమల్లు ఎమ్మెల్యే అయితే నియోజకవర్గాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తారన్నారు. కార్యక్రమంలో సోముదేవులరిపల్లె సర్పంచ్ ప్రశాంతి, ఉపసర్పంచ్ కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్ రమణయ్య, మున్సిపల్ వైస్ చైర్మన్ ఆయిల్ మిల్ ఖాజా, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శులు పోరెడ్డి నరసింహారెడ్డి, లక్కిరెడ్డి పవన్ రెడ్డి, ఆర్‌పీసీపీ మెంబర్ కాకర్ల నాగేశ్వరరెడ్డి, అటవీ అభివృద్ధి సంస్థ డైరెక్టర్ సానపురెడ్డి ప్రతాప్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ శౌరి సుభాష్‌రెడ్డి, రజక సంఘం నాయకుడు వెంకటేష్, ప్రొద్దుటూరు, రాజుపాళెం మండలాల వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు మార్తల ఓబుళరెడ్డి, గుద్దేటి రాజారాంరెడ్డి, 25వ వార్డు ఇన్‌చార్జి నూరి, కౌన్సిలర్లు పాతకోట వంశీధర్‌రెడ్డి, భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి, వరికూటి ఓబుళరెడ్డి, వడ్ల ఖలీల్, గరిశపాటి లక్ష్మీదేవి, కమాల్, జయలక్ష్మీ, మహ్మద్ గౌస్, వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షులు కామిశెట్టి బాబు, కోనేటి సునంద, శ్రీకృష్ణాలయం కమిటీ అధ్యక్షుడు చల్లా రాజగోపాల్ యాదవ్, వైస్ ఎంపీపీ ఆసం దస్తగిరిరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఖాదర్ బాషా తదితరులు పాల్గొన్నారు.

ప్రజారక్షణ భేరిపై ఇంటింటి ప్రచారం



కరపత్రాలు ఇచ్చి ప్రచారం చేస్తున్న సీపీఎం నాయకులు

పోరుమామిళ్ల : సీపీఎం ఆధ్వర్యంలో బద్వేలు, కడప, మైదుకూరు, ప్రొద్దుటూరు, విజయవాడల్లో నిర్వహిస్తున్న ప్రజారక్షణ భేరి బహిరంగసభలు జయప్రదం చేయాలని సోమవారం ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పోరుమామిళ్లలో ఇంటింటికి కరపత్రాలు ఇచ్చి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల కార్యదర్శి భైరవప్రసాద్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై సీపీఎం పోరాటం చేస్తోందన్నారు. విభజన హామీలు ఏ ఒక్కటీ అమలు చేయకపోగా, ప్రభుత్వ పరిశ్రమలు ప్రైవేటు పరం చేయడం, కార్మిక చట్టాలు తుంగలో తొక్కి, కార్మికుల హక్కులు హరించడంపై కేంద్రప్రభుత్వ విధానాలను అడ్డుకోవాల్సి ఉందన్నారు. రాష్ట్రంలో టీడీపీ, వైఎస్సార్‌సీపీ, జనసేన పార్టీలు కేంద్రాన్ని నిలయదీయడం లేదన్నారు. ప్రజలకు వివరించేందుకు ప్రజారక్షణ భేరి సభలు నిర్వహిస్తున్నామని, వాటిని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో

ప్రొద్దుటూరు : సీపీఎం చేపట్టిన ప్రజా రక్షణ భేరిని విజయవంతం చేయాలని అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లా కార్యదర్శి ఎస్. ముంతాజ్ బేగం కోరారు. సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సీపీఎం చేపట్టిన ప్రజా రక్షణ భేరి బస్సు యాత్ర ఈనెల 31న సాయంత్రం 6 గంటలకు మైదుకూరులో బహిరంగ సభ ఉంటుందన్నారు. నవంబర్ 1న బద్వేలు, కడపలలో బహిరంగ సభలు జరుగుతాయన్నారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 9 ఏళ్లు దాటిందని, మహిళల పట్ల విపరీతమైన దాడులు, హత్యలు పెరిగాయన్నారు. వాటిని అరికట్టడంలో బీజేపీ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఈ సమావేశంలో ఐద్వా పట్టణ కార్యదర్శి వెంకటసుబ్బమ్మ, అధ్యక్షురాలు సర్వేశ్వరి, సభ్యులు లక్ష్మీదేవి, భానుమతి పాల్గొన్నారు.

త్వరగా పైపులైన్, డ్రైనేజీ నిర్మాణ పనులు ప్రారంభించాలి

అధికారుల సమీక్షలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి


ప్రొద్దుటూరు : రూ.160 కోట్లతో మంజూరైన డ్రైనేజీ కాలువల నిర్మాణ పనులను, రూ.140 కోట్లతో మంజూరైన తాగునీటి పైపులైన్ పనులను త్వరగా ప్రారంభించాలని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి కోరారు. మున్సిపల్ కార్యాలయంలో సోమవారం సాయంత్రం ఆయన సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఏడాది ఏప్రిల్‌లో టెండర్లు జరిగాయని, డిజైన్స్ అప్రూవల్ కారణంగా పనులు ఆలస్యమవుతున్నాయన్నారు. తొలుత గోకుల్‌నగర్, రిషి అపార్ట్‌మెంట్ వీధుల్లో డ్రైనేజీ పనులు పూర్తి చేస్తామన్నారు. పట్టణంలోని అన్ని కాలువలను ఆధునీకరించిన అనంతరం మురికి నీరు బయటికి వెళ్లేందుకు బైపాస్‌రోడ్డు వద్ద ఐదు ఎకరాల భూమిని సేకరిస్తామన్నారు. అప్పుడే సమస్య పరిష్కారమవుతుందని అన్నారు. బ్రిటీష్ హయాంలో నిర్మించిన రామేశ్వరం ట్యాంక్‌తో పాటు 40 ఏళ్ల క్రితం నిర్మించిన వైఎంఆర్ కాలనీ, అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్, పాతమార్కెట్‌లో నిర్మించిన వాటర్ ట్యాంకులను తొలగించి వాటి స్థానంలో కొత్తవి నిర్మిస్తున్నామన్నారు. గత పాలకుల నిర్లక్ష్యం కారణంగానే ఈ పనులు చేపట్టలేదని, వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడ్డాకే ఈ ఆలోచన చేశామన్నారు. పట్టణంలో అపరిశుభ్రతకు ప్రధాన కారణం డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్తాచెదారమేనన్నారు. ఐదు ప్రధాన కాలువలను ఆధునీకరిస్తామని తెలిపారు. పట్టణ ప్రజలకు మౌలిక సదుపాయలు కల్పించడమే తన ప్రాథమిక కర్తవ్యమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. ప్రజల ఆశీర్వాదంతో ఎన్నికైన తాను ప్రజలకు కావాల్సిన నూతన కూరగాయల మార్కెట్, పెన్నానదిపై బ్రిడ్జి, బస్టాండ్‌ల నిర్మాణం, వైఎస్సార్ ఇంజినీరింగ్ కాలేజిలో అభివృద్ధి పనులు చేపడుతున్నామన్నారు. సమావేశంలో ప్రజా ఆరోగ్య శాఖ ఎస్ఈ శ్రీనాథరెడ్డి, ఈఈ చెన్నకేశవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లబ్ధి చేకూర్చేలా.. ప్రజల గుండెల్లో నిలిచేలా

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ సుధ

బద్వేలు అర్బన్ : కులం, మతం, పార్టీ చూడకుండా అర్హతే ప్రామాణికంగా ప్రతి గడపకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే డాక్టర్ సుధ పేర్కొన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని 33వ వార్డులోని గాండ్లవీధి, రెడ్డెయ్యమఠంవీధి, యాదవ నగర్‌లలో సోమవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి వార్డులోని ప్రతి గడపను సందర్శించారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను, ఆయా కుటుంబాలకు చేకూరిన లబ్ధిని వివరిస్తూ ముందుకు సాగారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్ళుగా భావించి పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల గుండెల్లో నిలిచిపోయారని అన్నారు. అర్హులై ఉండి సాంకేతిక కారణాలతో సంక్షేమ పథకాలకు నోచుకోని వారిని గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా గుర్తించి వారికి కూడా సంక్షేమ పథకాలు అందజేస్తామని తెలిపారు. రాష్ట్రాభివృద్ధి కోసం, పేదల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలు మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, కుడా చైర్మన్ గురుమోహన్, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి యద్దారెడ్డి, మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందర్‌రామిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ గోపాలస్వామి, వార్డు ఇన్‌చార్జిలు శ్రీనివాసయాదవ్, డాక్టర్ సత్యశ్రీనివాసరావు, దుద్దుకూరు సత్యం, శివయ్య, కేశవరెడ్డి, అనిల్, తిరుపతిరెడ్డి, రమేష్‌బాబు, బిజ్జం రమణ, చెన్నకృష్ణారెడ్డి, గోగుల ప్రసాద్, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సామాన్యులకు అందుబాటులో వైద్యం



మందుల కిట్‌ను అందజేస్తున్న డాక్టర్ హనీఫ్‌బాబా

ప్రొద్దుటూరు క్రైం : సామాన్య ప్రజలకు వైద్యం అందుబాటులో ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ రవిబాబు తెలిపారు. కామనూరు పీహెచ్‌సీ పరిధిలోని పెన్నానగర్ ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. సుమారు 541 మందికి వివిధ రకాల వ్యాధులకు చికిత్స అందించారు. వైద్యులు హనీఫ్‌బాబా, శ్రీకాంత్, జరీనా, హుసేన్‌బాషా, కంటి వైద్యుడు తేజలు వైద్య పరీక్షలు చేశారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార కౌంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ నజీర్‌అహ్మద్, స్పెషల్ ఆఫీసర్ సురేష్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి హరినాథ్, నాజీర్ హుస్సేన్, నూర్ అహ్మద్, వీఆర్వో సుహాసిని, డీపీఎంఓ శంకరయ్య, సీహెచ్ఓ కృష్ణమ్మ, సూపర్‌వైజర్ బీఏ వరప్రసాద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఈశ్వరి, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు వరం

పోరుమామిళ్ల : అనారోగ్యంతో ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న ప్రజలకు ముఖ్యమంత్రి అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష పథకం వరమని జెడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీ సీఎం బాషా పేర్కొన్నారు. సోమవారం రాజాసాహెబ్‌పేట సచివాలయం వద్ద నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో వారు పాల్గొని రోగులకు కిట్స్ పంపిణీ చేశారు.

ఎస్టీయూ మండలాల నూతన కమిటీ ఎన్నిక

కలసపాడు : రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) కలసపాడు మండలశాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పి.రమణారెడ్డి తెలిపారు. ఆదివారం పోరుమామిళ్లలోని ఎస్టీయూ భవన్‌లో నిర్వహించిన కౌన్సిల్ సమావేశంలో మండలశాఖ నూతన అధ్యక్షుడుగా చిన్నపురెడ్డి వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా బి.ఎన్.వి.ప్రసాద్, ఆర్థిక కార్యదర్శిగా కె.బాలచెన్నయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అదేవిధంగా ఉపాధ్యక్షులుగా కమాల్, సలోమి సత్యవతి, జోగారావు, వీరనారాయణరెడ్డి, నాగిరెడ్డి, కార్యదర్శులుగా పీర్ బాషా, వీరారెడ్డి, రవిక్రీస్తుదారి, మస్తాన్, బేబీసరోజ, శ్రీనివాసులు, విజయలక్ష్మి, రామచంద్రారెడ్డి, జిల్లా కౌన్సిలర్లుగా ఎస్.వి.సత్యనారాయణ, శేఖర్‌బాబు, శివారెడ్డి, వినోద్, బాలరాజునాయక్, సత్యనారాయణ, శ్రీనివాసులు తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.

ఎస్టీయూ నూతన కమిటీ ఎన్నిక

పోరుమామిళ్ల : మండల కేంద్రంలో సోమవారం జరిగిన ఎస్టీయూ వార్షిక కౌన్సిల్ సమావేశంలో మండల శాఖ నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పుల్లయ్య, ప్రధాన కార్యదర్శిగా జయరామిరెడ్డిని, కోశాధికారిగా బాషాను ఎన్నిక చేశారు. అనంతరం నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ విద్యారంగ అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. పాఠశాలల విలీన ప్రక్రియ కారణంగా విద్యారంగం ప్రమాద అంచుల్లోకి చేరిందన్నారు.

కాశినాయన మండలం..

కాశినాయన : మండల ఎస్టీయూ నూతన కార్యవర్గం ఎన్నిక ఏక్రగీవంగా జరిగిందని ఎస్టీయూ జిల్లా కౌన్సిలర్ యు.సుబ్రమణ్యం తెలిపారు. మండల అధ్యక్షుడిగా ఎం.రవీంద్రబాబు, ప్రధాన కార్యదర్శిగా ఎం.బాలఓబయ్య, ఆర్థిక కార్యదర్శిగా టి.ప్రదీప్‌లు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికైన వారు మాట్లాడుతూ మండలంలోని ఉపాధ్యాయుల సమస్యలపై శక్తివంచన లేకుండా పని చేస్తామన్నారు. అలాగే ఎస్టీయూ బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు.

ఓపీఎస్ సాధనే లక్ష్యం

బి.కోడూరు : ఇచ్చిన హామీ ప్రకారం పాత పెన్షన్ విధానం అమలు చేసేంత వరకు పోరాడతామని ఎస్టీయూ నూతన మండలశాఖ అధ్యక్ష, ప్రధాన, ఆర్థిక కార్యదర్శులు కె.కుమార్‌బాబు, బి.శ్రీనివాసులు, కె.ఖాసిం పీరా పేర్కొన్నారు. ఆదివారం పోరుమామిళ్లలోని ఎస్టీయూ భవన్‌లో జరిగిన వార్షిక కౌన్సిల్ సమావేశంలో వీరిని ఎన్నుకున్నట్లు ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పి.రమణారెడ్డి తెలిపారు. జిల్లా కౌన్సిలర్లుగా ఎస్.రాజగోపాల్‌రెడ్డి, వి.వి.క్రిష్ణారెడ్డి, కె.వెంకటసుబ్బయ్య, జి.రాజేంద్రలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు.

నంద్యాలలో పత్తి కొనుగోలు ప్రారంభం



మాట్లాడుతున్న సి.పార్వతమ్మ

ప్రొద్దుటూరు : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో సోమవారం నుంచి నంద్యాలలో పత్తి కొనుగోలును ప్రారంభించినట్లు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సి.పార్వతమ్మ తెలిపారు. సోమవారం ఆమె వ్యవసాయ మార్కెట్ యార్డులో విలేకరులతో మాట్లాడుతూ 2023–24 సంవత్సరంలో రైతులు పండించిన పత్తి పంటను క్వింటాలుకు రూ.6,620 నుంచి రూ.7,020 వరకు ధర నిర్ణయించారని తెలిపారు. నంద్యాలలోని బీసీజీ కాటన్ అండ్ ప్రెస్సింగ్ ఇండస్ట్రీస్‌లో ఈ కొనుగోలును ప్రారంభించారన్నారు. రైతులు పత్తి అమ్మకాలకు సంబంధించి ముందుగా ఆధార్ కార్డు, పట్టాదారు జిరాక్స్ పత్రాలను తీసుకెళ్లి రైతు భరోసా కేంద్రాల్లో నమోదు చేయించుకుని టోకెన్ తీసుకోవాలన్నారు. పత్తిలో తేమ 8 శాతం మాత్రమే ఉండాలని, అంతకంటే ఎక్కువ ఉంటే ధర తగ్గుతుందన్నారు. 12 కంటే తేమ శాతం ఎక్కువ ఉంటే పత్తిని కొనుగోలు చేసే పరిస్థితి ఉండదన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు కస్తూర్బా విద్యార్థినులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థినులతో పీఈటీ హసీనా

చాపాడు : నవంబర్ 4, 5, 6 తేదీల్లో కర్నూలు జిల్లా ఎమ్మిగనూరులో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు చాపాడులోని కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థిని షేక్ సనా ఎంపికైంది. ఈ నెల 28న కడపలోని క్రీడా పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి అండర్–17 ఫుట్‌బాల్ పోటీలో ఉత్తమ ప్రతిభకనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైంది. ఈ విద్యార్థినితోపాటు ఇటీవల జరిగిన జిల్లా స్థాయి యోగా పోటీలలో అండర్–14 బాలికల విభాగంలో కె.హేమ అనే విద్యార్థిని రాష్ట్రస్థాయికి ఎంపికైంది. నవంబర్ 1 నుంచి 3వ తేదీ వరకు పశ్చిమ గోదావరిలో జరిగే పోటీల్లో పాల్గొననున్నట్లు కస్తూర్బా గాంధీ పాఠశాల ప్రత్యేక అధికారి నాగలక్ష్మి, పీఈటీ హసీనా తెలిపారు.

అభివృద్ధి పనులను వేగవంతం చేయండి



సమావేశంలో పాల్గొన్న అన్నిశాఖల అధికారులు

గోపవరం : మండల వ్యాప్తంగా జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి ఎం.నాగరాజు పేర్కొన్నారు. సోమవారం అన్నిశాఖల అధికారులతో కలిసి అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల అమలుపై సమీక్ష నిర్వహించారు. నాడు – నేడు పనులు వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణాల్లో వెనుకబడి ఉన్నామని, వారం వారం నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేయాలన్నారు. డిసెంబర్ చివరిలోపు అసంపూర్తిగా ఉన్న అన్ని ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా హౌసింగ్ అధికారులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం నిర్వహించిన స్పందనలో వివిధ సమస్యలపై అర్జీలను స్వీకరించారు. సమీక్షలో తహసీల్దారు దామోదర్‌రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ హసీనా, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, పీఆర్ ఏఈ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

పాల్ ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

– డీఈఓ రాఘవరెడ్డి



విద్యార్థులకు పాల్ ల్యాబ్ హెడ్‌ఫోన్స్‌ను పంపిణీ చేస్తున్న డీఈఓ రాఘవరెడ్డి

మైదుకూరు : విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన పర్సనలైజ్డ్ అడాప్టిన్ లెర్నింగ్ (పాల్) ల్యాబ్‌ను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా విద్యాశాఖాధికారి రాఘవరెడ్డి తెలిపారు. మైదుకూరు జెడ్పీ బాలుర హైస్కూల్‌లో సోమవారం ఆయన పాల్‌ల్యాబ్‌ను ప్రారంభించారు. అనంతరం విద్యార్థులకు పాల్ ల్యాబ్ హెడ్ ఫోన్స్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఈఓ మాట్లాడుతూ ప్రభుత్వం బోధనలో టెక్నాలజీని ఉపయోగిస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాటలు వేస్తోందని తెలిపారు. ట్యాబ్‌ల ద్వారా విద్యా బోధనలో కొత్త కొత్త అంశాలను, మెలకువలను విద్యార్థులు స్వయంగా తెలుసుకుని, నేర్చుకునే అవకాశం కల్పిస్తోందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ పద్మలత, పాఠశాల హెచ్‌ఎం రమాదేవి, ఉపాధ్యాయులు ఆవుల శ్రీనివాసులు, ఎల్.సూర్యనారాయణరెడ్డి, మునెయ్య, ఆనందరావు పాల్గొన్నారు.


సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ రవిశంకర్

చాపాడు : ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని మండల విద్యాధికారి రవిశంకర్ పేర్కొన్నారు. స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో రూమ్ టూ రీడ్ ప్రాజెక్టులో భాగంగా కిశోర మేళా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన ఎంఈఓ మాట్లాడుతూ, ఈ మధ్యకాలంలో సైబర్ నేరాలు అత్యధికంగా జరుగుతున్నాయని, సెల్ ఫోన్‌లకు గుర్తు తెలియని కాల్స్, మెసెజెస్ ద్వారా వచ్చే వాటి పట్ల స్పందించరాదన్నారు. ఓటీపీలు, పిన్‌కార్డు నెంబర్‌లను ఇతరులకు తెలియజేయవద్దన్నారు. విద్యార్థులు వీటి పట్ల అప్రమత్తంగా ఉండాలని, తమ తల్లిదండ్రులు, బంధువులకు తెలియజేయాలన్నారు. విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ డిజిటల్ బ్యాంకింగ్ అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అనంతరం విద్యార్థులకు డ్రాయింగ్, క్విజ్ పోటీలు నిర్వహించి వాటిలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 వంశీకృష్ణ, కస్తూర్బా ప్రత్యేకాధికారి నాగలక్ష్మమ్మ, ఉపాధ్యాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత



అవ్వాతాతలకు ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న మల్లికార్జునరెడ్డి

గోపవరం : వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా కంటి పరీక్షలు చేయించుకున్న అవ్వాతాతలకు ఉచితంగా కంటి అద్దాలు పంపిణీ చేశారు. సోమవారం గోపవరం సచివాలయంలో వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు గోపవరం మల్లికార్జునరెడ్డి, పంచాయతీ కార్యదర్శి విజయకుమార్, ఏఎన్ఎం సుజాత చేతులమీదుగా అవ్వాతాతలకు కంటి అద్దాలు పంపిణీ కార్యక్రమం జరిగింది. గోపవరం, బేతాయపల్లె సచివాలయాల పరిధిలో వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా అవ్వాతాతలకు కంటి పరీక్షలు నిర్వహించగా వారిలో కొంత మందికి సాధారణ కంటి పరీక్షలు చేయడంతో పాటు అవసరమైన కంటి అద్దాలకు రెకమండ్ చేశారు. అలానే 75 మంది అవ్వాతాతలకు కంటి అద్దాలు అందజేశారు. ఈ సందర్భంగా పార్టీ అధ్యక్షుడు మాట్లాడుతూ వృద్ధులకు వృద్ధాప్య పింఛన్లు ఇవ్వడంతోపాటు కంటిచూపు మందగించిన అవ్వాతాతలకు ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి వైఎస్సార్ కంటి వెలుగు ద్వారా ఉచితంగా కంటి పరీక్షలు చేయడంతోపాటు వారికి అవసరమైన కంటి అద్దాలను కూడా ఇస్తున్నామన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నట్టు తెలియజేశారు.